క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్‌ఐ: జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర నగర్ పార్కు వద్ద వేసవి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కేఎస్ఎల్ హాస్పిటల్ అధినేత కిర్తి సుబ్బారావు అన్నారు. బుధవారం జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్‌ని కుండల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అలాగే బాటసారులకు మజ్జిగ వితరణ చేస్తున్నారు. క్లబ్ ఉపాధ్యక్షుడు వాసు, రాఘవరెడ్డి, క్లబ్ సెక్రెటరీ మూర్తి, కోశాధికారి నాగేశ్వరరావు రావ్, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులోని మోసానిక్‌లాడ్జి ఆవరణలో శ్రీశృంగేరి శారదా పీఠాదీశులు జగద్గురు శంకరాచార్య భారతీ తీర్థమహా స్వామిజీ 75వ జయంతి మహోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక ఉచిత కంటి వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. గౌతమి నేత్రాలయం వైద్యులు సేవలందించనున్నారు. పేదవారికి సమగ్ర కంటి చికిత్స ఉచితంగా చేయనున్నారు. ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డీసీసీబీ మాజీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి మృతి



సత్యనారాయణమూర్తి (ఫైల్)

కడియం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్, కడియపులంక సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గట్టి సత్యనారాయణ(82) మూర్తి బుధవారం కన్నుమూశారు. ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో ఉండి కడియపులంకతోపాటు, కడియం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు సుబ్బారావు, నరసయ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసయ్య కడియపులంక సర్పంచ్‌గా గతంలో సేవలందించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

ఊర కాలువను అభివృద్ధి చేయాలి

ధవళేశ్వరం: స్థానిక ప్రధాన ఊర కాలువను అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకుడు ఒంటెద్దు వీరవెంకట స్వామి కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్టు తెలిపారు. సుమారు 2 కిలోమీటర్లు పొడవు ఉన్న ఈ ఊర కాలువను అభివృద్ధి చేయాలని అనేకసార్లు కోరామన్నారు. 2016లో కాలువ అభివృద్ధికి మూడు ఎస్టిమేట్లు రూపొందించినా ఒక ఎస్టిమేట్ పనులు మాత్రమే గతంలో జరిగాయన్నారు. అది కూడా ఒక్కో చోట ఎనిమిది అడుగులు, ఒక్కో చోట ఏడడుగులు కొన్ని చోట్ల అయిదడుగుల వెడల్పుగా అస్తవ్యస్తంగా నిర్మించారన్నారు. ఊర కాలువ వెంబడి ఆక్రమణలు సైతం పెరిగాయన్నారు. క్వారీ కాలువ రోడ్డు వద్ద కల్వర్టును నిర్మిస్తే వర్షపు నీరు వేగంగా కాలువలో కలిసే అవకాశం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మలు తొలగింపు చర్యల్లో భాగంగా గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం తెలిపారు. జేఎన్ రోడ్, చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్, సూర్య ఫంక్షన్ హాల్, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్స్, శ్రీ వేంకటేశ్వరనగర్, హ్యాపీ స్ట్రీట్, వాకర్స్ రోడ్, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్, రూపా నగర్, పద్మావతి నగర్ పరిసర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వీఎల్ పురం సెంటర్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వీధి, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, పోస్టల్ కాలనీ, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు ఏరియా, తిలక్ రోడ్ సాయిబాబా టెంపుల్ ఎదురుగా వీధులు తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సువిశేష పురం, మల్లికార్జున నగర్, సుబ్బారావు పేట, టీటీడీ రోడ్ ఏరియా, ఎస్‌కేవీటీ స్కూల్ వీధి, భాస్కర్ నగర్, సుబ్రహ్మణ్య నగర్, దుర్గా నగర్, సీటీఆర్‌ఐ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పంచాయతీలకు పారిశుధ్య వాహనాల అందజేత

ధవళేశ్వరం: గెయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన మూడు పారిశుధ్య వాహనాలు, ఒక మినీ జేసీబీలను బుధవారం రాజమహేంద్రవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పంచాయతీలకు పంపిణీ చేశారు. ధవళేశ్వరం, కాతేరు, రాజవోలు గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మహీంద్రా ట్రక్కు వాహనాలను, మండలానికి ఒక మినీ జేసీబీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వి.శాంతామణి, ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు పండూరి అప్పారావు, గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు, తలారి మూర్తి, బీజేపీ నాయకుడు ఒంటెద్దు స్వామి పాల్గొన్నారు.

చిత్రాలు.. జీవిత సత్యాలు

- రాజమహేంద్రవరంలో చిత్రకళా వీధి ప్రదర్శన
- 500కి పైగా పాల్గొన్న ప్రముఖ కళాకారులు
- రేపు సెంట్రల్ జైల్ రోడ్డు నుంచి లాలాచెరువు రోడ్డు వరకూ ప్రదర్శనలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్



సెంటర్ జైల్ రోడ్డులో కళా జాతరకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సీటీఆర్‌ఐ: అరవై నాలుగు కళలలో చిత్రకళ ఒకటి. చిత్ర కళాకారుడి మనస్సు పరవశిస్తే చాలు కుంచే పట్టుకుని ప్రకృతిలోని అందాలను తన కాన్వాస్‌పై తీర్చిదిద్దుతాడు. జలపాతల సోయగాలు, అందమైన పూలవనం, జీవన విధానాలు ఇలా అనేక రకరకాలుగా చిత్రాలను గీచి మంత్రముగ్ధులను చేస్తారు. ఈ కళల రాజధాని రాజమహేంద్రవరం. ఇక్కడ కళాకారులకు లోటు లేదు. అందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న దామెర్ల ఆర్ట్స్ గ్యాలరీ ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ ఉన్న చిత్రాలు సజీవంగా మన కళ్ల ముందే ఉన్నట్టు కనిపిస్తుంటాయి.

శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి..

రాజమహేంద్రవరం నగరంలోని సెంట్రల్ జైల్ రోడ్డు నుంచి లాలా చెరువు రహదారి ప్రధాన మార్గంలో ×అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన*ను సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దేశ వ్యాప్తంగా ఉన్న కళలకు ప్రాధాన్యం కలిగిస్తూ, రాష్ట్ర కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ఈ చిత్రకళా వీధిని ఏర్పాటు చేస్తున్నారు. చిత్రకళకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని రావడంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 500కి పైగా కళాకారులు పాల్గొని వారి చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఈ నెల నాలుగో తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన జరగనుంది.

లైవ్ చిత్ర ప్రదర్శన, అమ్మకాలు..

గతంలో గీచిన పెయింట్‌లు, అప్పటికప్పుడు గీస్తున్న పెయింటింగ్‌లను ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా చేపట్టనున్నారు. ఈ విక్రయాలు వల్ల వచ్చిన డబ్బుని దామెర్ల ఆర్ట్ గ్యాలరీకి ఉపయోగించనున్నారు. కానీ ఒక్క రోజు మాత్రమే ఉండడంతో ప్రదర్శన ఎంత వరకూ విజయవంతమవుతుందో లేదోనని చిత్రకళా ప్రియులు అంటున్నారు. కనీసం మూడు రోజులైన ఈ ప్రదర్శన ఉంటే బాగుంటుందని చెబుతున్నారు.

ఆశయం మంచిదే కానీ..

దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించడం మంచి ఆశయమే కానీ, ఇక్కడ చాలా సమస్యలున్నాయి. సెంట్రల్ జైల్ రోడ్డు, లాలాచెరువు రోడ్డు చాలా ట్రాఫిక్ ఉంటుంది. ఈ ప్రదర్శనల కోసం రోడ్డుకి ఇరువైపుల టెంట్లు వేసి ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత ట్రాఫిక్‌లో ప్రదర్శనలు తిలకించడానికి ప్రజలకు అనేక ఇబ్బందులు రావచ్చు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవ్వచ్చు. పైగా మార్చి నుంచే భానుడి భగభగమంటున్నాడు. ఇప్పుడు ఎండలో చిత్రకళాకారులు, చిత్రాలు చూడడానికి వచ్చిన ప్రజలు అవస్థలు పడాల్సి ఉంటుంది. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ప్రశాంతి, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు ఎం.మల్లికార్జునరావులతో ×అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి



జేసీ చిన్నరాముడుకి వినతిపత్రం ఇస్తున్న అనంతరావు

సీటీఆర్‌ఐ: ప్రైవేట్ ఆసుపత్రులలో దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని వైద్యఆరోగ్యశాఖ జిల్లా అల్లోపతి ప్రైవేట్ మెడికల్ కేర్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో రోగుల నుంచి ఫీజులు ఎక్కువ వసూలు చేస్తున్నారని, రోగికి రకరకాల టెస్టులు, స్కానింగులు, ఎక్సరేలు పేరుతో అధిక మొత్తంలో సొమ్ములు తీసుకుంటున్నారని తెలిపారు. ధర్నాలకోట మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ఉన్నప్పటికీ అనేక ఆసుపత్రులలో రకరకాల సాకులు చూపి ఆ స్కీంను పక్కన పెట్టి డాక్టర్లకు నచ్చిన రీతిలో వైద్యం అందిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, చాలా చోట్ల సర్జరీ అవసరం లేకున్నా ఆపరేషన్ చేసి రోగుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ తక్షణం చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ కు ఆదేశాలు జారీ చేశారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం, శుక్రవారంలలో బీసీ కార్పొరేషన్, కమ్మ, కాపు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియలకు 2024–25 సంవత్సరాలకు సబ్సిడీతో కూడిన రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఈ కింది షెడ్యూల్‌ను అనుసరించి సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన కోరారు. గురువారం ఉదయం 9.30 గంటలకు ధవళేశ్వరం, తొర్రేడు, వెంకటనగరం గ్రామ అభ్యర్థులు, మధ్యాహ్నం 2.30 గంటలకు కోలమూరు, కాతేరు అభ్యర్థులు, 4న, ఉదయం 9.30 గంటలకు బొమ్మూరు, రాజవోలు గ్రామ అభ్యర్థులు, మధ్యాహ్నం 2.30 గంటలకు హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ గ్రామ అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఆయా గ్రామ పరిధిలోని బ్యాంకు అధికారులు పాల్గొంటారని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

కడియం మండలంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఇలా..

కడియం: బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు 3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో కే రమేష్ తెలిపారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని వివరించారు. గురువారం దామిరెడ్డిపల్లి, దుళ్ళ, కడియపుసావరం, మురమండ, మాధవరాయుడుపాలెం గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 4న జేగురుపాడు, కడియం, కడియపులంక, పొట్టిలంక, వీరవరం, వేమగిరి గ్రామాల లబ్ధిదారులు ఇంటర్వ్యూకి హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్ ఫాంలతో ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీవో వివరించారు.

రేపటిలోగా స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్ బ్యాక్ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ 2024 పోటీల్లో ముఖ్య కార్యక్రమమైన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ (ప్రజా అభిప్రాయ సేకరణ) శుక్రవారం లక్ష మందితో ఫీడ్ బ్యాక్ పూర్తి చేయాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ వార్డు సచివాలయ కార్యదర్శి సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను ప్రజల ద్వారా తప్పనిసరిగా సేకరించాలన్నారు. తద్వారా స్వచ్ఛ సర్వేక్షణ 2024 పోటీలో ఉత్తమ స్థానం సాధించే అవకాశం ఉందన్నారు. ప్రతి సచివాలయ కార్యదర్శి కనీసం 100 మంది ప్రజల ద్వారా ఫీడ్‌బ్యాక్‌ను పూర్తిచేయాలన్నారు. ఇప్పటికే రెండు వారాల క్రితం దీనిపై స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే కొంతమంది మాత్రమే వాటిని పూర్తి చేశారని, మిగిలిన కార్యదర్శులు తమ నిర్ణయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అన్నారు. ఇప్పటి వరకు 86,000 మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించారని, ఈ నెల 4వ తేదీ లోపు లక్ష మందితో సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను అందించడమే లక్ష్యమని పని చేయాలన్నారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న 'వర్క్ ఫ్రం హోమ్' సర్వేను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సిటీ ప్లానర్ జి.కోటయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఆరోగ్య అధికారి ఎ.వినూత్న, సెక్రటరీ శైలజవల్లి, మేనేజర్ అబ్దుల్ మలిక్ అస్పర్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడేందుకు యూటీఎఫ్ ఉద్యమం

కరపత్రాన్ని విడుదల చేసిన జిల్లా కార్యవర్గం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

సీటీఆర్‌ఐ: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా నడుంబిగించాలని యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు యూటీఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం యూటీఎఫ్ జిల్లా సంఘం కలెక్టరేట్ వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించింది. రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ్ కుమారి నేతృత్వంలో ×ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం*పే రిట ప్రచురించిన ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఏ సమాజంలో అయితే బలంగా ఉంటాయో ఆ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడేందుకు ఉపాధ్యాయులు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఐ.రాంబాబు, ఎం.విజయ గౌరీ, కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శిలు కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలి

సీటీఆర్‌ఐ: ఉపాధ్యాయులు డిమాండ్లు నెరవేర్చాలని ఫ్యాప్టో చైర్మన్ డేనియల్‌బాబు అన్నారు. 11 పీఆర్‌సీ గడువు ముగిసి 21 నెలలు అయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లో ఆందోళన నెలకొందన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో 12వ పీఆర్‌సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, మెమో 57 అమలు, సమాంతర మాధ్యమం, పెండింగ్ బకాయిలు తదితర డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటై 9 నెలలు ముగిస్తున్నా ఆ ఊసేలేదన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలనే పలు డిమాండ్‌లతో నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ జయకర్, రాష్ట్ర కోశాధికారి నరహరి, కో చైర్మన్ శేష సుబ్రహ్మణ్యం, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: చికిత్స పొందుతూ దివాన్‌చెరువు ప్రాంతానికి చెందిన పందిరి ఇళయరాజా(37) మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దివాన్‌చెరువుకు చెందిన పందిరి ఇళయరాజాకు వివాహమైనప్పటికీ భార్యభర్తలు విడిగా ఉంటున్నారు. ఇటీవల విడాకులు కోసం ఇళయరాజాను అతని భార్య నగదు కావాలని అడిగింది. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం మజ్జిగలో పురుగుమందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే అతనిని చికిత్సకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇళయరాజా తండ్రి పందిరి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కూటమి ప్రభుత్వ హామీలను నిలబెట్టుకోకపోతే ఆందోళన తప్పదు
- 10 నుంచి ఆందోళన చేస్తామని బొజ్జా రామకృష్ణ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జ రామకృష్ణ తదితరులు

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): రాష్ట్రవ్యాప్తంగా కార్మిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న 40 వేల భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమల్లు శ్రీనివాసరావు, బొజ్జ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి రోడ్డెక్కి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మిక శాఖ కార్యాలయాలను ముట్టడించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో లింగమల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, క్లెయిమ్‌లు పరిష్కరిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నమ్మబలకడంతో ఓట్లేసి గెలిపించామని, ఇప్పటికి 10 నెలలు కావస్తున్నా అసలు దాని ఊసే తేవడం లేదన్నారు. బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ కోట్ల రూపాయల సెస్ వసూలు చేస్తున్నా కార్మికులకు ఎటువంటి మేలు చేయడం లేదన్నారు. అసలు ఆ డబ్బులను ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. పవన్ కల్యాణ్ కోటి రూపాయలు ప్రకటించారని అది ఏమైందో తెలియడం లేదన్నారు. కార్మిక శాఖ ఉన్నా కార్మికులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదని, కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ కేవలం అధికారులు ఇచ్చిన పేపర్లు చదివి అంతుంది, ఇంతుంది అంటూ చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. 40 వేల కుటుంబాలు దీన స్థితిలో క్లెయిమ్ ఎప్పుడు పరిష్కామవుతుందోనని ఎదురుచూస్తున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదంటూ ఉద్వేగానికి లోనయ్యారు. ఈనెల 10వ తేదీ నుంచి ఉద్యమం చేపడతామని వెల్లడిరచారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యక్షుడు పి.తారక్‌నాథ్ మాట్లాడుతూ అసలు తనకు శిక్షణ ఇవ్వకుండానే విశ్వకర్మ కార్డు ఇచ్చారని వాపోయారు. సమావేశంలో ఇతర నాయకులు మంత్రిప్రగడ శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, రవి, ఉప్పు సత్యనారాయణ, కాకి రవి బాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గొందేసి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రైల్వేస్టేషన్ మెయిన్‌రోడ్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ ప్రెసిడెంట్ పాల కృష్ణప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజూ మొబైల్ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు. నగరంలో ప్రధాన కూడళ్లలో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత రీజనల్ చైర్మన్ చింతా ప్రసాద రెడ్డి, కో చైర్మన్ మద్దుల మురళీకృష్ణ, కన్వీనర్ బీఎస్ఎస్ మూర్తి, డైరెక్టర్లు మెహర్ మధు, మింది నాగేంద్ర, చీఫ్ అడ్వైజర్ శ్రీమతి రుద్రమదేవి, అడ్వైజర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న అంబేడ్కర్ జయంతి ఉత్సవ ర్యాలీ

సీటీఆర్‌ఐ: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ సేవా కేంద్రం(ఆస్క) ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆస్క వ్యవస్థాపకుడు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుబ్బల రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తిని, సిద్ధాంతాలను ఇంటింటికి తీసుకువెళ్లాల్సు ఉద్దేశంతో అంబేడ్కర్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆస్క ద్వారా గత ఐదేళ్లుగా అంబేడ్కర్ జయంతి ఉత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపే ఉద్దేశంతో అంబేడ్కర్ జయంతి మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కవి, గాయకుల సమ్మేళనాలు, అంబేడ్కర్ ఆలోచనా పరులతో రౌండ్ టేబుల్ సమావేశం, అంబేడ్కర్ వాదులకు సన్మానాలు వంటి కార్యక్రమాలను మే 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, తిరగటి దుర్గ, కొక్కిరి కిరణ్(ల్యాబ్ కిరణ్), బత్తిన చక్రధర్, కొల్లి వినయ్, రేగుళ్ళ బాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు సర్వీస్ పెంచాలి

ప్రకాశంనగర్ : మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు 60 సంవత్సరాల నుంచి 62ఏళ్లకు సర్వీసును పెంచాలని ఏపీ మున్సిపాల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం సమావేశం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ పారిశుధ్య కార్మికులు 60 సంవత్సరాలు నిండిన వారి కుటుంబ పోషణ వారిపై ఆధారపడే కుటుంబీకులకు వారి స్థానంలో ఉద్యోగం కల్పించాలన్నారు. రిటర్న్ అయిన కార్మికులకు గ్రాడ్యుటీతో పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళా పోరం జిల్లా కన్వీనర్ లావణ్య, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నతమైన విద్య

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని, క్రమశిక్షణను తప్పితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు హితవు పలికారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలలో వివిధ విభాగాలను బుధవారం ఆమె పరిశీలించారు. సోషల్ మీడియా ప్రభావంతో తల్లిదండ్రులు, గురువులపై జోక్స్ వేయడం, వారి మాటలను లెక్కచేయకపోవడం వంటి చేష్టలు సరికాదన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను గ్రహించి, సమాజహితంగా ఎదగాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగానే అడుగులు వేయాలన్నారు. సీనియర్స్, జూనియర్స్ అనే భేదబావాలు రాకూడదని, సీనియర్లు ఎల్లప్పుడూ జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దివాన్‌చెరువు కుర్రోడు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిన ధాన్యం గింజలతో వేసిన వేంకటేశ్వరుని బొమ్మ, చిత్రకారుడు బబ్లూ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువుకు చెందిన బబ్లూ అనే యువకుడు ధాన్యం గింజలతో వేంకటేశ్వరుని బొమ్మను చిత్రీకరించి, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం పొందాడు. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడమంటే అతనికి ఎంతో ఇష్టం. దానిని గుర్తించిన అతని తల్లిదండ్రులు కొడుకు ప్రతిభను ప్రోత్సహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఢిల్లీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కోర్సు చేస్తున్నాడు. బబ్లూ తండ్రి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్ డాంగీ కుటుంబ సమేతంగా 25 సంవత్సరాల క్రితం దివాన్‌చెరువు వచ్చి, పానీపూరీ విక్రయిస్తూ జీవనం ప్రారంభించాడు. అప్పటి నుంచి అదే వ్యాపారం చేస్తూ అందరికీ పానీపూరీ రమేష్‌గా చిరపరిచితుడయ్యాడు. ఆర్ఎస్ఎస్ ద్వారా అవకాశం రావడంతో కొడుకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కోర్సు చేస్తుంటే, కుమార్తె రాజమహేంద్రవరంలో ఇంటర్ చదువుతోంది.

రెండు లక్షల ధాన్యం గింజలతో..

కలియుగ దైవం వేంకటేశ్వరుని బొమ్మను రెండు లక్షల ధాన్యం గింజలతో వేయడానికి వారం రోజులు పట్టిందని బబ్లూ తెలిపాడు. వీడియో తీసి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ పంపించడంతో ఈ గుర్తింపు లభించిందన్నాడు. వారం పది రోజులలో ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ అవార్డును ఆ సంస్థ జిల్లా కలెక్టర్‌కు పంపిస్తుందన్నాడు. జీవితంలో మంచి ఆర్టిస్టుగా గుర్తింపును పొందడంతోపాటు, తాను పుట్టిపెరిగిన దివాన్‌చెరువుకు మంచి పేరు తీసుకురావాలనేదే తన లక్ష్యంగా పేర్కొన్నాడు.

సినిమాలు



శ్యామల	: రాబిన్‌హుడ్
సూర్యమినీ	: సికిందర్
సూర్యప్యాలెస్	: మ్యాడ్ స్క్వేర్
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: రాబిన్‌హుడ్
అనుశ్రీ	: వీరధీరశూర
రాజా	: రాబిన్‌హుడ్
ఊర్వశి	: ఎల్2ఎంపురాన్
మేనక	: సికిందర్
రంభ	: కోర్ట్
కుమారి	: మ్యాడ్ స్క్వేర్
అప్సర	: మ్యాడ్ స్క్వేర్
అశోక	: మ్యాడ్ స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: రాబిన్‌హుడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మ్యాడ్ స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: మ్యాడ్ స్క్వేర్